సాక్షి శ్రీకాకుళం

గురువారం । 9 । నవంబర్ । 2023



వెంటాడిన మృత్యువు

జిల్లా కేంద్రం పరిధిలోని నాగావళి నదిలో మునిగి బాలుడు మృత్యువాతపడ్డాడు. తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. - IIలో



సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం ఎన్టీఆర్ పురపాలక మైదానంలో గురువారం సీతారాముల కల్యాణం జరగనుంది. రెండు వేల మంది దంపతులు పాల్గొంటారు. - IIలో

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణా కేంద్రంలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. పేటీఎం, 2050-హెల్త్‌కేర్, వరుణ్‌మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల్లో పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏఎన్ఎం, జీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ, బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులన్నారు.

న్యూస్‌రీల్

చార్జిషీట్‌లు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైల్లో ఉన్న ముద్దాయిల కేసుల విషయంలో త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ సమీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా పోలీసు యంత్రాంగం కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణికుమార్, భాస్కరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిప్పేస్వామి, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అదనంగా ధాన్యం అడిగే మిల్లర్లపై చర్యలు



మాట్లాడుతున్న జేసీ నవీన్

జలుమూరు/సారవకోట: రైతుల నుంచి మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసే సమయంలో నిర్దేశించిన కేజీలు కంటే అదనంగా ధాన్యం అడిగితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ హెచ్చరించారు. బుధవారం జలుమూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏ-గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,203, బీ-గ్రేడ్ రకం రూ.2,183గా మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం అమ్మిన 21 రోజులకు రైతుల ఖాతాకు నగదు జమ అవుతుందన్నారు. అనంతరం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈకేవైసీకి అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 390 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వాటి ద్వారా సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, సివిల్ సప్లయ్ డీఎం కె.శ్రీనివాస్, తహసీల్దార్ బి.సత్యం, ఏఓ కె.సురేష్ కుమార్, డీఎం శ్రీనివాసరావు, సారవకోట ఎంపీడీఓ రాంబాబు, తహశీల్దార్ హనుమంతరావు, నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి, ఏఓ కెసీహెచ్ వెంకటరావు పాల్గొన్నారు.

గిరి రహదారుల పరిశీలన



రోడ్డు పనులపై చర్చిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

మెళియాపుట్టి: సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి బుధవారం మెళియాపుట్టి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. కొండ ప్రాంతాల్లో గిరిజన గ్రామాలైన హడ్డివాడ, కేరాసింగి, కేరాసింగిగూడల పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం డేగలపోలూరు, చింతలపోలూరు గ్రామాల్లో జీపీఎస్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆమెతో పాటు ఎంపీడీఓ చంద్రకుమారి, సిబ్బంది ఉన్నారు.

ఐటీఈపీ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం (2023-24) ప్రారంభిస్తున్న నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీలో 110 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టులో గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023లో అర్హత మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 16న మెరిట్ లిస్ట్ ప్రదర్శిస్తామని తెలిపారు.

పొదుపు సంఘాలే.. మినీ బ్యాంకులు



నెల్లిపర్తిలో పొదుపు సంఘాల సభ్యుల సమావేశం (ఫైల్)

- తాము పొదుపు చేసిన సొమ్ము రుణాలు ఇచ్చే వెసులుబాటు
- వాటిపై వడ్డీ ఆదాయం సంఘం ఉమ్మడి ఖాతాకు జమ
- ఫలితంగా డ్వాక్రా మహిళలకు అదనపు ఆదాయం



సరుబుజ్జిలి: స్వయం సహాయక సంఘాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఈ కోవలోనే పొదుపు -రుణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. సభ్యులు ప్రతి నెలా పొదుపు చేసుకునే సొమ్ము నుంచి అంతర్గత రుణం రూపంలో అవసరాలకు వాడుకునేలా అవకాశం కల్పించారు. దీనితో వచ్చే వడ్డీ తిరిగి సంఘానికే జమ చేసి వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు బ్యాంకర్లతో మాట్లాడి నిబంధనలు సరిచేసేలా చొరవ తీసుకున్నారు.

ఇదీ పరిస్థితి..

మహిళలు కనీసం పది మంది సమైక్య సంఘంగా ఏర్పడి కొంతమేర పొదుపు చేసుకొని, బ్యాంకుల నుంచి రుణం తీసుకొని అవసరాలకు వినియోగించుకునేవారు. అయితే పొదుపు సొమ్ము వినియోగానికి అంతగా అవకాశం ఉండేది కాదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు పొదుపు సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతమయ్యేలా బ్యాంకర్ల నిబంధనలు సరిచేశారు. దీని ప్రకారం మహిళా సంఘాలు తమ పొదుపు ఖాతాలో ఉన్న సొమ్మును మినీ బ్యాంకు తరహాలో అంతర్గత రుణాలు ఇచ్చే దిశగా బ్యాంకులు ముందుకు సాగుతున్నాయి. జిల్లాలో 1294 గ్రామ సంఘాల్లో 49,030 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు. రూ.668.82 కోట్ల పొదుపు సొమ్ము ఉంది. ఇందులో నుంచి ఆగస్టు నుంచి 2023 అక్టోబర్ 30 వరకు 17,888 మంది సంఘ సభ్యులు రూ.27.65 కోట్లు అంతర్గత అప్పులుగా పొందారు.

ఉమ్మడి నిధిలో జమ..

పొదుపు సంఘాలు ఆర్థికంగా మరింత బలపడటమే మినీ బ్యాంకుల ఉద్దేశం. గతంలో ఒక సంఘం నుంచి నలుగురు సభ్యులు నాలుగు లక్షల రూపాయలు బ్యాంకు రుణంగా తీసుకుంటే దానిపై వచ్చే వడ్డీ ఇప్పటివరకు బ్యాంకు సేవింగ్ ఖాతాకే పరిమితం చేసేవారు. ప్రస్తుతం సభ్యులు తమ సంఘంలోని సొమ్మును ఎవరికైనా రూపాయి వడ్డీకి అప్పుగా ఇస్తే వడ్డీ తిరిగి వచ్చే సమయంలో ఆ డబ్బులు సంఘ ఉమ్మడి నిధిలో జమచేస్తారు. వడ్డీ సొమ్ము సభ్యులందరి ఖాతాకు జమ కావడం వల్ల అప్పు తీసుకున్న సభ్యురాలికి కూడా కొంత ఉపశమనం కలుగుతుంది. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 17,888 మంది ఒక్కొక్కరూ రెండు నుంచి మూడు లక్షల రూపాయలు చొప్పున రుణాలు పొందారు.

అంతర్గత వ్యవస్థత బలోపేతం..

గతంలో పొదుపు సంఘాల సభ్యులు నెలవారీగా దాచుకున్న పొదుపు సొమ్ములో బ్యాంకు సేవింగ్ ఖాతాలో నిరుపయోగంగా పడి ఉండేవి. దీంతో పావలా వడ్డీ కూడా సభ్యులకు దక్కేదికాదు. దీంతో ప్రభుత్వం చొరవచూపి బ్యాంకుల్లో నిల్వ ఉన్న పొదుపు సంఘాల నిధులు సంఘ సభ్యుల ద్వారా ఇతరులకు గానీ, సభ్యులకు గానీ అప్పులు ఇచ్చి దాని వడ్డీ సంఘ నిధికి జమ అయ్యేలా నూతన విధానం తీసుకొచ్చారు. ఓ వైపు సంఘాలు బ్యాంకుల నుంచి ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకుంటూ, మరోవైపు తాము సొంతంగా రుణాలు అందించి అంతర్గత వ్యవస్థను బలోపేతం చేసుకొంటున్నాయి. ఈ రుణాలు నెలవారీ గానీ, ఒకే విడతగా గానీ చెల్లించేందుకు సంఘాలు అవకాశం కల్పిస్తున్నాయి. దీని ద్వారా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా తామే బ్యాంకర్లుగా మారి ఆర్థికంగా బలపడుతున్నారు.

నూతన విధానం బాగుంది



ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతం కోసం తీసుకొచ్చిన నూతన విధానం వల్ల సంఘాలకు చాలా ప్రయోజనం. గతంలో పొదుపు చేసిన సొమ్ము బ్యాంకులో ఉంటే పావలావడ్డీ వచ్చేది. ప్రస్తుతం పొదుపు సొమ్ముల నుంచి మా సభ్యులకే మినీ బ్యాంకుల తరహాలో రుణాలు ఇవ్వడం వల్ల రూపాయి వడ్డీ గిట్టుబాటు అవుతోంది. దీంతో సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నాయి.

– ఎద్ల సులోచన, స్వయం సహాయక సంఘ సభ్యురాలు, నవలాపురం జంక్షన్

ఆర్థికంగా ప్రయోజనం..



పొదుపు నిధిలో 90 శాతం వరకు సొమ్మును సంఘ సభ్యులకు గానీ, ఇతరులకు గానీ అప్పుల రూపంలో ఇవ్వవచ్చు. దీనిపై ఎటువంటి ఆంక్షలు విధించరాదని ఇప్పటికే ప్రభుత్వం బ్యాంకర్లకు సూచించింది. పొదుపు చేసిన నగదును అప్పుగా ఇస్తే వచ్చిన వడ్డీ సంఘం నిధికి జమవుతుంది. దీనివల్ల సభ్యులకు ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది.

– పి.కూర్మారావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, వెలుగు

జిల్లాలో స్వయం సహాయక సంఘాలు	సంఘ సభ్యులు	అంతర్గత అప్పు(పొదుపు) తీసుకున్న సంఘ సభ్యులు	వాడిన రుణాల మొత్తం
1,294	49,030 మంది	17,888	రూ.27.65 కోట్లు

23న జిల్లాకు సీఎం జగన్ రాక

- పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభం
- ముందస్తు పరిశీలన చేసిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ



బహిరంగసభ కోసం ప్రైవేటు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

కాశీబుగ్గ: ఉద్దాన కిడ్నీ బాధితుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం పలాసలో రూ.50 కోట్లతో నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జి.ఆర్.రాధిక పలాసలో పలు ప్రాంతాల్లో ముందస్తు పరిశీలన చేపట్టారు. రూట్‌మ్యాప్, హెలీప్యాడ్, బహిరంగ సభావేదికపై అధికారులతో చర్చించారు. కిడ్నీ బాధిత గ్రామానికి వెళ్లే అవకాశం ఉన్నందున రామకృష్ణాపురం, రంగోయి గ్రామాల స్థితిగతులపై ఆరా తీశారు. బహిరంగ సభ వేదిక ఖరారైతే అధికారిక షెడ్యూల్‌ను సీఎంఓ కార్యాలయం విడుదల చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర, పలాస ఆర్డీఓ భరత్ నాయక్, కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్, తహశీల్దారు మధుసూదనరావు, వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడు కంచరాన ఖగేశ్వరనాయుడు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పి. శ్రావణి శ్రీనివాస్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, కమిషనర్ నాగేంద్రకుమార్, నాయకులు డబ్బీరు భవానీశంకర్, దున్న సత్యం, సురేంద్ర నారాయణ త్యాడి, రోణంకి శ్రీనివాస్, తమ్మినాన శాంతారాం, బల్ల శ్రీనివాసరావు, బి.డి.రావు, ఎస్.సింహాచలం, కోరాడ ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్

- విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ పిలుపు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కొన్ని దశాబ్దాలుగా జరగని అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే గత నాలుగున్నరేళ్లలో మన రాష్ట్రంలో సాధ్యమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. ప్రతి మండలంలో ఒక గ్రామ సచివాలయం చొప్పున కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులంతా కలిసి ప్రారంభిస్తారని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ప్రజల్లోకి వెళ్లి అందరి కంటే ముందు ఏమేం చేశామో, ఏం చేయగలమో తెలియజేశామని.. ఇప్పుడు వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి) పేరుతో మరోసారి జనంలోకి వెళ్లబోతున్నామని వివరించారు. ఇన్నాళ్లు చేసిన సంక్షేమాన్ని గుర్తుచేస్తూ జగన్‌తోనే ఇవన్నీ సాధ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సచివాలయం పరిధిలో ఏయే లబ్ధిదారులకు ఏయే సంక్షేమ పథకాలు అందాయి.. ఏమేరకు అభివృద్ధి జరిగిందనే విషయాన్ని బోర్డులపై పొందుపరుస్తున్నట్లు చెప్పారు. ఇంకా అర్హులు ఉంటే వెంటనే గుర్తించి సంక్షేమ ఫలాలు అందజేసేలా కృషి చేస్తామన్నారు. వైనాట్ 175 నినాదంతో కార్యక్రమాన్ని చురుగ్గా చేపడుతామన్నారు. దేశంలో జీడీపీ అభివృద్ధి రేటు కలిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్థానం దక్కిందన్నారు. తలసరి ఆదాయంలో 9వ స్థానంలో ఉన్నామన్నారు. ఇప్పటివరకు 4.93 లక్షల ఉద్యోగాలను కల్పించామని వివరించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో 34 వేలు ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, 22 లక్షల ఇళ్లు నిర్మించి గ్రామాలు నిర్మించామని తెలిపారు. కొత్తగా నాలుగు ఓడరేవులు, 10 ఫిషింగ్ హార్బర్లు, రెండు విమానాశ్రయాలు, 17 మెడికల్ కాలేజీలు, మూడు ఐటీ సెజ్‌లు నిర్మించామని వివరించారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్, పార్టీ నాయకులు చింతాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధం

- జిల్లాలో ప్రస్తుత ఓటర్లు 18,26,953 మంది
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రోరల్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 18,26,953 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీలు మాత్రమే బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల తరఫున బీఎల్‌ఏలను నియమించారని, ఇంకా సమయం ఉన్నందున మిగిలిన పార్టీలు కూడా నియమించుకోవాలని సూచించారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. దావాలు, అభ్యంతరాల దాఖలు (పీరియడ్ ఫర్ ఫిల్లింగ్ క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్) చేసేందుకు డిసెంబరు 9 వరకు గడువు ఉందన్నారు. తొలగించిన డెత్ ఓటర్ల వివరాలు కావాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కోరగా.. వివరాలు అందజేయాలని సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఫారం-6,7, తదితర ఫారాలపై ఉన్న అభ్యంతరాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ప్రస్తుతం పోలింగ్ స్టేషన్ల మార్పులు లేవని స్పష్టం చేశారు. అంతకుముందు గొడౌన్‌లోని ఈవీఎంలను కలెక్టర్, నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు శంకరరావు, టీడీపీ నేత పి.ఎం.జె.బాబు, కాంగ్రెస్ నేత డి.గోవింద మల్లిబాబు, బీఎస్పీ నాయకుడు ఎల్.సోమేశ్వరరావు, సీపీఎం నేత తేజేశ్వరరావు, సీ- సెక్షన్ సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు, డీటీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గాల్లో ప్రాణాలు!



నరసన్నపేట జాతీయ రహదారిలో జమ్ము కూడలి వద్ద ఫ్లై ఓవర్ రోడ్డుపై బుధవారం గ్రానైట్ ట్రాలీ లారీ అదుపు తప్పింది. విశాఖ నుంచి టెక్కలి వెళ్తూ డివైడర్ మీదుగా దూసుకెళ్లి టెక్కలి-శ్రీకాకుళం రోడ్డు దాటి రక్షణ గోడను ఢీకొట్టింది. లారీ ముందుభాగం గాల్లో వేలాడుతూ కనిపించింది. డ్రైవర్ జోయి రాజు సకాలంలో బయటకు వచ్చేయడం, రోడ్డుపై ఇతర వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం ఆధ్వర్యంలో లారీని జేసీబీలతో తొలగించారు. -నరసన్నపేట

వేలి కొనలపై ఓటు వివరం

- ఓటర్ హెల్ప్ యాప్‌లో ఓటు హక్కు వివరాలు
- ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు ఉందో, లేదో తెలుసుకునే వెసులుబాటు
- ఓటరు కార్డు నంబర్‌తో వివరాలు లభ్యం



ఆమదాలవలస రూరల్: సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేసి వెల్లడించారు. జిల్లాలో ఓటర్ల సంఖ్యను అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో తమ ఓట్లు ఉన్నాయో లేవో వివరాలు ఎలా తెలుసుకోవాలో అన్న మీమాంస చాలా మందిలో ఉంటుంది. వాటికి సమాధానంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు మీ ఓటు ఉందో, లేదో మీ ఇంటి డోర్ నంబర్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. దొంగ ఓట్లు ఉంటే వాటిని కూడా తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌తో

- ముందుగా ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఒకటి ఎంపిక చేసుకుని రిజిస్టర్ చేయాలి. తరువాత మీ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు నాలుగు మార్గాలు ఉన్నాయి.
- బార్ కోడింగ్ స్కానింగ్ ద్వారా పాత ఓటరు కార్డుల ముందు భాగంలో బార్ కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్‌ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. కెమెరా తెరుచుకోగానే ఓటరు కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు వస్తాయి.
- క్యూర్ కోడ్ స్కానింగ్ ద్వారా కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే మీ ఓటరు వివరాలు తెలుస్తాయి.
- వివరాల నమోదు చూసి దీని ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు కార్డులో ఉన్నట్లు గానే పేరు, తండ్రి పేరు, వయస్సు, లింగం, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు గురించి తెలుసుకోవచ్చు.
- ఓటు కార్డు నంబర్‌తో ఓటరు వివరాలు తెలుసుకోవచ్చును. ప్రతి ఓటర్ కార్డుకు నంబర్ ఉంటుంది. నంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నెంబరు నమోదు చేస్తే ఓటు వివరాలు తెలుస్తాయి.
- పై నాలుగు విధానాల్లో ఇది చాలా సులువుగా ఉంటుంది. మీ వద్ద కార్డు లేకపోతే నంబరు ఉంటే చాలు మీ ఓటు వివరాలు తెలుస్తాయి.

వెబ్‌సైట్ ద్వారా..



ఎన్నికల సంఘం ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వెబ్ సైట్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చును. దీనికి voters.eci.gov.in లోకి వెళ్లాలి. ఓటర్స్ సర్వీస్ పోర్టల్ కేంద్ర ఎన్నికల సంఘంను క్లిక్ చేయాలి. ఇందులో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్‌ను క్లిక్ చేయాలి. ఇక్కడ సెర్చ్ బై డిటైల్స్, సెర్చ్ బై ఎపిక్, సెర్చ్ బై మొబైల్ ఆప్షన్లలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. దానిలో వివరాలు నమోదు చేసి, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి, సెర్చ్ చేస్తే మీ ఓటు ఉందో లేదో తెలిసిపోతుంది. సెర్చ్ బై డిటైల్స్ అనేది కాస్తంత కఠినంగా ఉంటుంది. మిగిలిన రెండు ఆప్షన్ల ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. సెర్చ్ బై మొబైల్ ఎంపిక చేసి ఆ మొబైల్ నంబర్‌తో ఎన్ని ఓట్లు లింక్ అయి ఉన్నా వాటి వివరాలన్నీ వస్తాయి. పై ఆప్షన్ల ద్వారా మీ వివరాలు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లు. వెంటనే మీ బూత్ లెవెల్ అధికారికి ఫిర్యాదు చేయాలి. కొత్త ఓటు నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యత.

కొనసాగుతున్న పీజీ సెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పీజీ సెట్-2023 రెండో విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 11 వరకు ఆప్షన్ల నమోదు ఉంటుంది. 18న సీట్ల కేటాయింపు, 20 నుంచి 23 తేదీల మధ్య సీట్లు వచ్చిన విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. పీజీ సెట్‌లో ర్యాంకు వచ్చి మొదటి విడతలో సీట్లు రాని, కోర్సులు, కళాశాలల్లో మార్పు కోరుకునే విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య సూచించారు.

అభిషేక ప్రియుడు



పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో అయ్యప్పస్వామికి బుధవారం పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

రైతు అనుమానాస్పద మృతి



పాలంలో సింహాచలం మృతదేహం

పోలాకి: మండలంలోని సుసరాం గ్రామానికి చెందిన తమ్మినాన సింహాచలం (57) అనే రైతు వ్యవసాయ పొలంలో సాగు నీరు పెట్టేందుకు వెళ్లి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడి కుమార్తె సనపల సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఎలుగుపిల్ల మృత్యువాత



జీడితోటలో మరణించిన ఎలుగుబంటి పిల్ల

మందస : ఉద్దానం ప్రాంతమైన బహడపల్లి సమీపంలోని జీడితోటల్లో ఓ ఎలుగుబంటి పిల్ల మంగళవారం రాత్రి మరణించింది. ఇటీవల ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువైంది. పిల్ల ఎలుగుబంట్లు కూడా ఎక్కువగా తిరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం ఇక్కడికి వచ్చిన ఎలుగు పిల్లను సేదతీర్చి పాలుపట్టి తోటల్లో వదిలేశారు. తోటల్లో మరణించిన ఎలుగుపిల్లకు గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో మరణించి ఉంటుందని భావిస్తున్నారు. ఎలుగుబంటి పిల్ల మరణించడంతో తల్లి ఎలుగు అసహనంతో ఉంటుందని, ఎవరిపై.. ఎప్పుడు దాడి చేస్తోందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారాన్ని అటవీశాఖాధికారులకు తెలియజేశారు.

కొండచిలువ దాడిలో మేక పిల్లలు మృతి



హతమైన కొండచిలువ

టెక్కలి రూరల్: మండలంలోని సరియాపల్లి గ్రామంలో కొండచిలువ దాడిలో బుధవారం నాలుగు మేక పిల్లలు మృతిచెందాయి. బొరిగిపేటకు చెందిన గండేటి రామారావు తన మేక పిల్లలను సరియాపల్లి గ్రామ సమీపంలో మేతకు తీసుకువెళ్లాడు. ఈ సమయంలో అటుగా వచ్చిన కొండచిలువ దాడి చేయడంతో నాలుగు మేకపిల్లలు మృతిచెందాయి. స్థానికులు అప్రమత్తమై కొండచిలువను హతమార్చారు.

అరబిందో ఇకపై ఏపీటోరియా ఫార్మా



పేరు మార్పును ప్రకటిస్తున్న వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో మూడున్నర దశాబ్దాలకు పైగా ఫార్మా రంగంలో జీవనాధార ఔషధాలు తయారు చేస్తున్న అరబిందో ఫార్మాను ఏపీటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరు మార్చినట్లు కార్పొరేట్ హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు తెలిపారు. బుధవారం పైడిభీమవరంలోని పరిశ్రమలో ఫ్యాక్టరీ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియంట్ (ఏపీఐ) విభాగాలు కలిపి ఏపిటోరియా ఫార్మా ప్రైవేటు లిమిటెడ్‌గా మనుగడలోకి వచ్చిందన్నారు. యాజమాన్యం, బోర్డాఫ్ డైరెక్టర్స్, ఇతర పాలసీల్లో ఎటువంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పైడిభీమవరం యూనిట్ హెచ్‌ఆర్ అడ్మిన్ కె.కమలాకర్ రెడ్డి, హెచ్‌ఆర్ అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శిక్షణకు బొంతలకోడూరు సర్పంచ్



పంచిరెడ్డి రాంబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీరాజ్ సంస్థ రాజమహేంద్రవరంలో ఈ నెల 9, 10 తేదీల్లో పంచాయతీరాజ్ పాలన, చట్టాలు అమలు అనే అంశంపై రాష్ట్రస్థాయి శిక్షణ ఏర్పాటు చేస్తోంది. ఈ శిక్షణకు జిల్లా నుంచి పలువురు అధికారులు హాజరవుతుండగా సర్పంచ్‌ల విభాగంలో బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఆహ్వానం అందిందని, శిక్షణ సద్వినియోగం చేసుకుంటానని రాంబాబు తెలిపారు.

కథా ప్రపంచానికి స్వాగతం

- శ్రీకాకుళానికి ప్రత్యేక ఆకర్షణగా కథా నిలయం
- అందుబాటులో వేలాది కథలు
- ఆన్‌లైన్‌లోనూ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- నేడు కారామాస్టారు శతజయంతి ఆరంభ సభ

శ్రీకాకుళం కల్చరల్: అగ్రగణ్య తెలుగు కథా రచయితల్లో కాళీపట్నం రామారావు(కారా మాస్టారు)కు ప్రత్యేక స్థానం. కథల ప్రపంచానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శ్రీకాకుళం కథా నిలయం వ్యవస్థాపకులుగా తనదైన ముద్ర వేశారు. అటువంటి మహనీయుడి శత జయంతి సభ ఈ నెల 9న జరగనుంది. జిల్లా కేంద్రంలోని కథా నిలయంలో జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి అధ్యక్షునిగా ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, ముఖ్య అతిథిగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు, స్నేహ కళాసాహితీ, విశ్వసాహితి, రాజాం రచయితల వేదిక, కథానిలయం ట్రస్టు సభ్యులు, సాహితీ స్రవంతి శ్రీకాకుళం ,విజయనగరం, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం రచయితలు, అభిమానులు హాజరుకానున్నారు.

కథలకు నెలవు..

కారామాస్టారుగా ప్రసిద్ధిగాంచిన కాళీపట్నం రామారావు 1924 నవంబరు 9న జన్మించారు. సామాన్యులకూ అర్థమయ్యే భాషలో రచనలు చేశారు. శ్రీకాకుళంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకు చదివారు. భీమిలిలో సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. 1943 నుంచి 1946 వరకు పలుచోట్ల ఉద్యోగాలు చేసి 1948 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. 1972లో ఉద్యోగ విరమణ చేశారు. 2021 జూన్ 4న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణానంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. కారా మాస్టారు 1996లో రాసిన యజ్ఞం కథకు సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. దాంతో వచ్చిన సొమ్ముతో ఆత్మీయులు, రచయితల సలహాల మేరకు కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. 1997 ఫిబ్రవరిలో శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో సూర్యానగర్ వద్ద రెండంతస్తుల భవనాన్ని కథా నిలయంగా మార్చారు.



కథానిలయంలో ఉన్న పుస్తకాలు

కారామాస్టారు



శ్రీకాకుళంలోని విశాఖ ఏ-కాలనీలో కథానిలయం

అన్ని కథలు నిక్షిప్తం..

1986 నుంచి కథల సేకరణ మొదలుపెట్టారు. 1910 కాలం నాటి కథలు సైతం సేకరించారు. ఆల్ ఇండియా రేడియో సహకారంతో ఇప్పటి వరకు 40మంది రచయితల గొంతుకలను రికార్డు చేశారు. 800 పుస్తకాలతో ప్రారంభమైన కథానిలయంలో ప్రస్తుతం 16 వేల పుస్తకాలు, 24 వేల పత్రికలు, 5 వేల సంకలనాలు, కథా సంపుటాలు, 100 ఫీచర్ రచనలు, 105 వ్యాస సంకలనాలు, 67 ఆత్మకథలు, 97 పరిశోధనా పత్రాలు, 95 జీవిత చరిత్రలు, 130 సాహిత్య సర్వస్వాలు, 53 ఉపయుక్త గ్రంథాల సూచికలు, 45ఇ తర భాషల్లో వచ్చిన తెలుగు పుస్తకాలు, 8200 ఇతర పుస్తకాలు సేకరించారు. 15 వేల కథా రచయితలకు చెందిన పుస్తకాలు నిక్షిప్తం చేశారు. ఆన్‌లైన్‌లో 'కథానిలయం డాట్‌కామ్'లో కథలు డౌన్‌లోడ్ చేసి చదువుకోవచ్చు. కథలపై పరిశోధన చేసే వారికి కథా నిలయం ఆసరాగా ఉంటోంది. 2004లో కేంద్ర సాహిత్య అకాడమీ రూపొందించిన 'తెలుగు కథాకోశం' పుస్తకానికి కథానిలయం పూర్తి సహకారం అందించింది. ఇది రచయితల డైరెక్టరీగానూ ఉపయోగపడుతోంది.

12 ఏళ్ల అనుబంధం..



కారా మాస్టారుతో కలిసి కథల సేకరణ కోసం పనిచేశాను. ఆయనతో 12 ఏళ్లు కలిసి పనిచేయడం నా సాహిత్య జీవితంలో మరిచిపోలేనిది. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా కథా నిలయాన్ని నడుపుతున్నాం.

– దాసరి రామచంద్రరావు, రచయిత, కథా నిలయం ట్రస్టు కార్యదర్శి

ఆయన బాటలోనే..



శ్రీకాకుళ సాహితీ, కారా మాస్టారు, కథానిలయం ఈ మూడు వ్యవస్థలు కలిస్తే కాళీపట్నం రామారావు. మాస్టారుతో ప్రయాణం మూడు దశాబ్దాలు. తెలుగు సాహితీ రంగంలో ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శం.

– అట్టాడ అప్పలనాయుడు, కథా, నవలా రచయిత

అక్రమంగా ఆవులు తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



వ్యాన్‌లో ఉన్న ఆవులు

కోటబొమ్మాళి: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రెండు వ్యాన్‌లలో తరలిస్తున్న 110 ఆవులను గురువారం శ్రీకాకుళం స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్లు పి.రాజు, షేక్ అహమ్మద్‌లను అరెస్టు చేసి కోటబొమ్మాళి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి సేకరించిన ఆవులను రెండు వ్యానులల్లో ఎక్కించి ఎవరికీ కనిపించకుండా చుట్టూ పరదాలతో కప్పి హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న సమాచారమందుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు కోటబొమ్మాళి మార్కెట్‌యార్డు వద్ద జాతీయ రహదారిపై కాపుకాశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వ్యాన్‌లలో ఆవులను గుర్తించారు. కేసు నమోదు చేసి ఆవులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఉద్యోగ బాధ్యతలను మరిచిపోవద్దు



కొత్త ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు, పదోన్నతులు పొందిన వారు ఉద్యోగ బాధ్యతలను మరచిపోవద్దని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మంగళవారం ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లకు టైపిస్టులుగా పదోన్నతులు కల్పించగా, మరో ఇద్దరికి కారుణ్య నియామకాల కింద టైపిస్టులుగా నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఐదుగురు నైట్‌వాచ్‌మేన్లకు ఆఫీస్ సబార్డినేట్లుగా కన్వర్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- నాగావళి నదిలో మునిగి బాలుడి మృత్యువాత
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



గొర్లె శశాంక్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : పాఠశాలకు సెలవు ఇచ్చారనే ఆనందంతో నదీస్నానానికి వెళ్లిన ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసింది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న నాగావళి నదిలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం డీసీసీబీ కాలనీ సమీపంలోని భవానీనగర్‌కు చెందిన గొర్లె మహేశ్వరరావు, సునీత దంపతులకు అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న కుమార్తె, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు శశాంక్ (14) ఉన్నారు. మహేశ్వరరావు ఎల్ఎన్‌పేట మండలం రావిచంద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. శశాంక్.. నారాయణ స్కూల్‌లో చదువుతున్నాడు. ఎస్ఎఫ్ఐ బంద్ కారణంగా బుధవారం సెలవు దినం కావడంతో సమీపంలోని బ్యాంకర్స్ కాలనీకి చెందిన నలుగురు మిత్రులు నాగరాజు, పవన్‌సాయి, లోచన్, యువరాజ్‌లతో కలిసి ఉదయం ఎనిమిదింటికే ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆర్ట్స్ కళాశాల వెనుకభాగాన ఉన్న నాగావళి నది వద్దకు చేరి కాసేపు క్రికెట్ ఆడారు. తర్వాత అందరూ ఒకేసారి నదిలో స్నానానికి దిగుతుండగా అక్కడే ఉన్న ఓ దివ్యాంగుడు వారించాడు. నదిలో దిగొద్దని చెప్పినా వినకుండా లోపలకు వెళ్లడంతో ఒక్కసారిగా గుమ్మిప్రాంతంలోకి శశాంక్ జారిపోయాడు. మిగిలిన వారు బయటకు వచ్చి కేకలు వేయడంతో దివ్యాంగుడు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే శశాంక్ మునిగిపోయాడు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో రెండో పట్టణ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు, హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ, పీసీలు త్రినాథ్, విజయ్‌లు ఘటనా స్థలికి చేరుకుని అగ్నిమాపకశాఖకు సమాచారమందించారు. ఏఎస్ఎఫ్‌వో పి.దుర్గారెడ్డి, డ్రైవింగ్ ఆపరేటర్ బి.అప్పారావు, ఫైర్‌మాన్ ఎల్.రమణ, వై.పాపారావులతో కూడిన రెస్క్యూ బృందం శశాంక్ మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లి సునీత విగతజీవిలా పడి ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల నిర్ణయంపై జర్నలిస్టుల హర్షం



ధర్మాన కృష్ణదాస్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ని దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీతో నూటికి నూరు శాతం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ప్రభుత్వంగా జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఇప్పటికే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ స్థలాల పంపిణీపై విధివిధానాలను రూపొందిస్తుందన్నారు. అర్హులైన పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎస్.ఈశ్వరరావు, బి.వి.ఎస్.నాయుడు, ఎ.రామకృష్ణ, రాజు, సాంబ, సురేష్, శాస్త్రి, కృష్ణ, ఆకుల మాధవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు పాల్గొన్నారు.


రైతుకూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా అమర వీరుల స్మారక భవనం వద్ద రెండు రోజుల పాటు జరిగిన అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా 10వ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా మామిడి భీమారావు, ఉపాధ్యక్షునిగా సవర బంగ్లా కుమార్, జిల్లా కార్యదర్శిగా బైరి కూర్మారావు, సహాయ కార్యదర్శిగా జి.లక్ష్మణరావు, కోశాధికారిగా వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లాలోని వివిధ సమస్యలపై పూర్వపు జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని, ఆదివాసీ ప్రాంతంలో భూములకు రక్షణ కల్పించాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని తీర్మానాలు చేస్తూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

నందిగాంలో పులి కలకలం



గ్రామస్తులకు సూచనలిస్తున్న అటవీ అధికారులు

నందిగాం: ఇటీవల పలు మండలాల్లో సంచరిస్తూ హడలెత్తిస్తున్న పెద్దపులి నందిగాం మండల పరిధిలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారు. కొండల ప్రాంతమైన బడగాం పంచాయతీ సవర బడగాంకు చెందిన సవర నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు తన కుమారుడితో కలిసి బుధవారం ఉదయం తోటకు వెళ్లి వస్తుండగా ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వైపు నుంచి కొండతెంబూరు కొండ వైపు పులి వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులకు తెలియజేయడంతో వారంతా వచ్చి పరిశీలించగా పాదముద్రలు కనిపించాయి. విషయం తెలుసుకున్న పాతపట్నం రేంజ్ అటవీ అధికారి రౌతు రాజశేఖర్ సిబ్బందిని గ్రామానికి పంపించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని నందిగాం తహసీల్దార్ పద్మావతి సూచించారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీకాకుళం ఎన్టీఆర్ పురపాలక మైదానంలో నిర్వహణ
- రెండు వేల మంది దంపతుల సమక్షంలో కల్యాణోత్సవం



మైదానంలో ఏర్పాటు చేస్తున్న ఆలయ నమూనా

శ్రీకాకుళం కల్చరల్: సీతారాముల కల్యాణోత్సవానికి శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం సిద్ధమైంది. నారాయణ తిరుమల ఆధ్వర్యంలో రెండువేల మంది దంపతుల సమక్షంలో గురువారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామతీర్థాల నుంచి తీసుకొచ్చిన సీతారాముల ఉత్సవమూర్తులకు సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించనున్నారు. అయోధ్య రామాలయానికి చెందిన శ్రీరామ బంగారు పాదుకలను భక్తుల దర్శనార్థం ఉంచుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు..

కల్యాణోత్సవ ఏర్పాట్లను నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు బుధవారం పరిశీలించారు. కల్యాణానికి విచ్చేసే భక్తులకు, పాదుకలను దర్శించడానికి వచ్చే భక్తులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు వేల మంది దంపతులు కూర్చునేలా 4వేల కుర్చీలు వేయిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నారాయణ తిరుమల నుంచి విజయోత్సవ యాత్ర బయలుదేరుతుందన్నారు. ఆధ్యాత్మిక వైభవం గోచరించేలా రూ.12లక్షలతో ఆలయ సెట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. కల్యాణాన్ని బయట నుంచి తిలకించేందుకు వీలుగా ప్రధాన కూడళ్ల వద్ద ఎల్ఇడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

పార్కింగ్ ఇలా..

టూవీలర్, కార్లకు మైదానం బయటకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని యతిరాజులు తెలిపారు. పార్కింగ్, బందోబస్తుపై రెండో పట్టణ ఎస్‌ఐ లక్ష్మణరావుతో చర్చించినట్లు చెప్పారు. చెప్పులు భద్రపరిచేందుకు మైదానం లోపల ప్రవేశద్వారం వద్ద కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ శాఖ సహకారంతో తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ సుగుణాకరరావు, ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పేర్ల సాంబమూర్తి, బత్తుల శారద, కృష్ణమోహన్, శ్రావణ్, మల్లారపు చక్రవర్తి పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని తిరుపతికి పాదయాత్ర



గురునాథ్ యాదవ్ పాదయాత్రను ప్రారంభిస్తున్న కిల్లి కృపారాణి తదితరులు

టెక్కలి: ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ టెక్కలికి చెందిన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ తలపెట్టిన తిరుపతికి పాదయాత్రను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ ఒకప్పుడు సంక్షేమ పథకం అందాలంటే నాయకులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడలా కాకుండా అర్హతే ప్రామాణికంగా గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం గురునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో గోపినాథ ఆలయం, రావివలస మల్లన్న ఆలయం, సంతబొమ్మాళి పాలేశ్వరస్వామి ఆలయం, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయాన్ని దర్శనం చేసుకుంటూ పాదయాత్రను కొనసాగించారు. నెల రోజుల్లో తిరుపతి చేరుకుంటానని గురునాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, నాయకులు డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, చింతాడ గణపతి, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు వి.శ్రీధర్‌రెడ్డి, బి.కార్తీక్, బి.లక్ష్మీపతి, కె.బాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో విద్య



విద్యార్థితో ముచ్చటిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ.. పోటీ ప్రపంచానికి అనుగుణంగా తయారుచేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడులో భాగంగా రూ.1.16 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువుతోనే పేదరికాన్ని రూపు మాపవచ్చని, చదువే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి అని భావించి సీఎం జగన్ విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులకు అందించడంలో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని కితాబిచ్చారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో మనబడి నాడు-నేడు ద్వారా చేపడుతున్న పనుల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, హెచ్ఎం ఆర్.విజయకుమారి, రవికుమార్, చింతాడ రవికుమార్, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.